క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ తనిఖీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. సదాశివనగర్ సర్కిల్‌కు బదిలీపై వచ్చిన నూతన సిబ్బందికి విధి నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు. సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్, ఏఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎస్సై సుధాకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో సెల్ ఫోన్‌ల ద్వారా పలు రకాల మోసాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నట్లు వివరించారు. అలాగే విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. వేగంగా వాహనాలను నడిపి విలువైన ప్రాణాలను పోగొట్టుకొని కన్నవారికి దుఃఖాన్ని మిగల్చవద్దన్నారు. ప్రిన్సిపాల్ నరేందర్, విద్యార్థులున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధికి లింగంపేటకు చెందిన మున్నూరుకాపు, రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం రూ.1,11,111 విరాళం ఇవ్వగా రజక సంఘం రూ. 51,000 విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు డీటీ రవి తెలిపారు. చిన్న గుజ్జుల్, పెద్ద గుజ్జుల్, సోమారం తండా, బీర్మల్ తండా, చద్మల్ తండా, నేరల్ తండాలో 25 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి చెక్కులు అందజేసినట్లు డీటీ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.కోటి రుణాలు..



ఎల్లారెడ్డి: ఇందిరా మహిళా శక్తి పథకం కింద మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంగళవారం కోటి రూపాయల రుణాలు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మహిళా సంఘాలకు చెక్కును అందించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మున్సిపాలిటీ పరిధిలోని 10 మహిళా సంఘాలకు 10 లక్షల చొప్పున రుణాలు అందజేసినట్లు మెప్మా సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వాసంతి, మెప్మా సిబ్బంది అమృత, రేఖ, అనసూయ, సోనీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పున:ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నందివాడ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంఈవో రామస్వామి పున:ప్రారంభించారు. ఈ పాఠశాలలో చాలా రోజుల నుంచి మధ్యాహ్న భోజనం వండడం లేదని నవంబరు 29న సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీవో సాజీద్‌అలీ, ఎంఈవో రామ స్వామి అక్కడికి వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఏజెన్సీలను పాఠశాలకు రప్పించి వారితో మాట్లాడారు. అనంతరం ఏజెన్సీల ద్వారా భోజనాన్ని తయారు చేయించి విద్యార్థులకు అందించారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఎంఈవో రామ స్వామి, హెచ్ఎం రవికుమార్, పాఠశాల కమిటీ చైర్మన్ మోనా బాయి పాల్గొన్నారు.

విత్తనక్షేత్రంలో రబీసాగుకు మోక్షం..!

- గత రెండు సీజన్లలో పంటలసాగుకు నోచుకోని క్షేత్రభూములు
- ఎట్టకేలకు ఈ యేడు రబీలో 50 ఎకరాలలో వరిసాగుకు సన్నద్ధం



ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగులోకి రానున్న మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలోని భూమి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఏడాదికాలంగా పంటలసాగుకు దూరమైన మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలోని భూముల్లో ఈ యేడు రబీ పంటల సాగుకు మోక్షం కలగనుంది. సాగునీరు లేకపోవడంతో పాటు ఉన్నతాధికారుల నుంచి సకాలంలో అనుమతులు రాక గతయేడు రబీతోపాటు ఈ యేడు ఖరీఫ్ సీజన్లలో విత్తన క్షేత్ర భూములు ఎలాంటి పంటల సాగుకు నోచుకోలేదు. గడిచిన యేడాదికాలంలో గుంట భూమి కూడ సాగులోకి రాకపోవడం గమనర్హం. గతంలో క్షేత్రంలో పంటల సాగు అనుమతుల కోసం విత్తనక్షేత్ర అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా వారి నుంచి సకాలంలో స్పందన రాకపోవడంతో భూములు బీడుగానే మిగిలిపోయాయి. 2022–23 ఖరీఫ్‌లో విత్తన క్షేత్రంలోని 20 ఎకరాలలో కేఎస్ఎం1638 రకం వరి పంటను సాగుచేశారు. 2022–23 రబీతో పాటు 2023–24 ఖరీఫ్ సీజన్లలో విత్తనక్షేత్రంలో పంటలు సాగు చేయలేదు. ప్రస్తుత రబీ సీజన్‌లో విత్తన క్షేత్రంలో 50 ఎకరాలలో వరి పంటలు సాగు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రభూముల్లో వేసే పంటలకు సాగునీటిని అందించే భారీ మోటార్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల్లో విత్తన క్షేత్రంలో వరి నారు కోసం విత్తనాలను చల్లనున్నట్లు క్షేత్ర సిబ్బంది తెలిపారు.

'పోచారం'నీరే ఆధారం..

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో సాగయ్యే పంటలకు మండలంలోని పోచారం ప్రాజెక్టు నీరే ఆధారం కానుంది. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలోకి విడుదలయ్యే నీరు ప్రత్యేక డిస్ట్రిబ్యూటరీ ద్వారా ఓపెన్ వెల్‌లోకి చేరుతుంది. అందులో నుంచి నీటిని భారీ 30 హెచ్‌పీ మోటార్లు ఎత్తి సాగు భూములకు చేరుస్తాయి. పంటల సాగు కోసం సాగునీటి విడుదలపై ఈ నెలాఖరులో ఆయకట్టు రైతులతో అధికారులు త్రైబందీ సమావేశం నిర్వహించనున్నారు. జనవరి మొదటి వారంలో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరు వరకు విత్తనక్షేత్ర అధికారులు నారుమడిని సిద్ధం చేయనున్నారు. జనవరిలో విత్తన క్షేత్రంలోని భూముల్లో వరినాట్లు వేస్తామని క్షేత్ర సిబ్బంది తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు

- నస్రుల్లాబాద్‌లో నిత్యం గాయపడుతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం





కోతుల దాడిలో గాయపడిన పోచవ్వ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో కోతులు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. వారానికి ఒకరి చొప్పున కోతుల దాడికి గురవుతున్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన గల్లెంక పోచవ్వను మంగళవారం కోతి కరవడంతో తీవ్రంగా గాయపడింది. ఆమె సోదరిపై సైతం కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మంచం పట్టింది. అధికారులు, పాలకులు పట్టించుకొని కోతుల బెడదను తీర్చాలని కోరుతున్నారు.

రెండు సార్లు కరిచింది



నాకు ఇప్పటికే రెండు సార్లు కోతి కరిచింది. ఇప్పటికీ పత్యం ఉంటున్నాను. నోటి నిండా అన్నం తినలేక పోతున్నాను. కోతుల బెడద వల్ల ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి కోతుల బెడద అరికట్టాలని కోరుతున్నాం.

– అంజవ్వ, బాధితురాలు, నస్రుల్లాబాద్

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు



బిచ్కుందలో రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్/బిచ్కుంద(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు చేరుతున్నాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద పరిధిలో రెండు రేషన్ దుకాణాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం ఇవ్వనుందని, పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమం ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను సీఎం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు.ఆరు గ్యారంటీ పథకాలు సద్వినియోగం చేసుకొని నిరుపేదలు లబ్ధిపొందాలని కోరారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, బిచ్కుంద నాయకులు వెంకట్‌రెడ్డి, దర్పల్ గంగాధర్, తహసీల్దార్ సురేష్ పిట్లం ఏఎంసీ చైర్మన్ మనోజ్ పటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఎల్లమ్మ కుచ్చ వద్ద నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు 30 ఎకరాల ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టం కల్గించే మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. కళాశాలలో విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, ఎన్ఎస్ఎస్ రెండో, మూడో యూనిట్ ప్రోగ్రాం అధికారులు జి.చంద్రశేఖర్‌గౌడ్, బి.శారద తదితరులు పాల్గొన్నారు.

58వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: న్యుమోనియా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి అత్యవసరంగా ఓ–నెగిటివ్ రక్తం అవసరం కావడంతో అయ్యప్ప మాల ధరించిన పట్టణానికి చెందిన కిరణ్ మంగళవారం రక్తదానం చేశారు. కిరణ్ రక్తదానం చేయడం ఇది 58వ సారి. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు అభినందించారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



దాతలను సన్మానిస్తున్న చంద్రకాంత్ రెడ్డి

దోమకొండ: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయానికి దాతల సహకారంతో రూ.66, 500 విలువైన పుస్తకాలను పాఠకులకు అందజేసి ఆయన మాట్లాడారు. పేద మధ్య తరగతి కుటుంబాలకు గ్రంథాలయాల వల్ల మంచి చదువు, విజ్ఞానం అందుతుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పరీక్షలకు సిద్ధం కావాలని, ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని కోరారు. అనంతరం పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందజేసిన దాతలు తీగల తిర్మల్‌గౌడ్, ఐరేని నర్సయ్య, అనంతరెడ్డి, శంకర్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, తదితరులను శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంత రెడ్డి, చాముండేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ సిద్దా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు స్వామి, శ్రీకాంత్, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, దుర్గా రెడ్డి తదితరులున్నారు.

విజయవంతంగా 95 రోజుల ప్రణాళిక అమలు చేయాలి



బాన్సువాడ రూరల్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి అధ్యాపకులు 95 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలు చేయాలని కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మంగళవారం ఆయన బాన్సువాడలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు సిలబస్ పరంగా పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం కళాశాల రికార్డులు, రిజిష్టర్లు, టీచింగ్ డైరీ, వార్షిక ప్రణాళికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ అసద్ ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



భిక్కనూరు: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జంగంపల్లిలో భిక్కనూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని ఆటోల యజమానులతో పాటు డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నా ఆటో– నా భద్రత అనే నినాదంతో వాహనాలు నడపాలని ఆయన సూచించారు. రోడ్డు నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సీఐ సంపత్ కుమార్, ఎస్సైలు సాయికుమార్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కేకేవై రహదారిని జాతీయ రహదారిగా మార్చండి

- మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ విజ్ఞప్తి



మంత్రి కోమటిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

ఎల్లారెడ్డి : కరీంనగర్– కామారెడ్డి –ఎల్లారెడ్డి(కేకేవై) రోడ్డును నాలుగు లేన్ల జాతీయ రహదారిగా మార్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కేకేవై రోడ్డును జాతీయ రహదారిగా మారుస్తూ నాందేడ్ వరకు పొడిగించేందుకు ఎన్నో రోజులుగా ప్రతిపాదనలు ఉన్నా పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన మంత్రి కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చించి జాతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నిర్మాణ పనులను వేగవంతం చేయండి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన డబుల్‌బెడ్ రూం నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో సరైన సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

'విద్యార్థుల జీవితాలతో చెలగాటం'

కామారెడ్డి టౌన్: విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ విమర్శించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన కళాశాల హాస్టల్‌ను బీఆర్ఎస్‌వీ నేతలు సందర్శించారు. కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు నాయకులను అడ్డుకున్నారు. కాసేపు ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం మైనార్టీ వెల్ఫేర్ జూనియర్ కళాశాల సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ నేతలు భానుప్రసాద్, మారుతి, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఎల్లారెడ్డి: సమాన పనికి సమాన వేతనం విధానం కింద తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎల్లారెడ్డి మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వారు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వీణ బాయ్, సమగ్ర శిక్ష ఉద్యోగులు అశోక్, కాశిరాం, విజయ్, మహేష్, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద గల గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్ల మహేశ్ చారి, ముత్యంరాజులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

5న ఉమెన్స్ కబడ్డీ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: ఈ నెల 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్ ఉమెన్స్ పోటీల్లో పాల్గొనడానికి ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డి లయోల హైస్కూల్‌లో జిల్లా జట్టు ఎంపిక చేయనున్నట్టు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వరగౌడ్ తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని, 75 కిలోల లోపు బరువు ఉండాలన్నారు. వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి, 93985 71110 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

10 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

దోమకొండ: మండల కేంద్రంలో ఈ నెల 10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు ఉంటాయని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారురు తప్పనిసరిగా 18 నుంచి 31 ఏళ్ల మధ్యలో వుండాలన్నారు. ప్రతి క్రీడాకారుడు ఆధార్ కార్డు, ఫోటో సమర్పించాలని, ఒక క్రీడాకారుడు ఒకటి కంటే ఎక్కువగా ఆటలలో పాల్గొనవచ్చని తెలిపారు. గ్రామ పంచాయితీ స్థాయిలో ఈ నెల 7, 8 తేదీల్లో మండల స్థాయిలో 10 నుంచి 12 వరకు పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉంటాయన్నారు.

'మాదిగల అణచివేతకు సీఎం కుట్ర'



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న సామ్యేల్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మాదిగల అణచివేతకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణకు చట్టబద్ధత కాకుండా 30 సంవత్సరాలుగా అడ్డుకున్నది.. అడ్డుకుంటున్నది స్వార్థ పరులైన కాకా(గడ్డం వెంకట్ స్వామి) కుటుంబమేనన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరిపోయి మాదిగలకు ఉప కులాలకు అవకాశాలు దక్కకుండా డబ్బు బలంతో రాజకీయాలను శాసిస్తున్నారన్నారు. మండల ఇన్‌చార్జి కొత్త్తోళ్ల యాదగిరి, సీనియర్ నాయకులు వెంకట్ రాములు, మహిళ విభాగం అధ్యక్షులు సట్టిగారి లక్ష్మి, మండల నాయకులు మర్కంటి దాకయ్య, కొమ్ము సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన కల్పించాలి



భిక్కనూరు: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన కల్పించాలని ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..14 ఏళ్లు నిండిన వారు ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతిలో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. మండల విద్యా నోడల్ అధికారి శ్రీనాథ్, మండల విద్యాధికారి రాజగంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీధర్ వాసుదేవ్ సేవలు మరువలేనివి



కామారెడ్డి అర్బన్: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ) వ్యవస్థాపక సెక్రటరీ జనరల్ శ్రీధర్ వాసుదేవ్ కల్విత్ శత జయంతి సందర్భంగా ఎల్ఐసీ కామారెడ్డి శాఖలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచారు. డివిజన్ అధ్యక్షుడు పెద్ది సందీప్ మాట్లాడుతు.. బీమా రంగంలో దశాబ్దాల పాటు ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. డివిజన్ ఉపాధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కాద్లాపూర్‌లో 100 శాతం విద్యుత్ చార్జీల వసూలు

బాన్సువాడ రూరల్: కద్లాపూర్‌లో రైతులు వ్యవసాయ విద్యుత్ బిల్లులను ఏకకాలంలో 100 శాతం చెల్లించినట్లు లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాములు తెలిపారు. రూ.26,190 డిమాండ్‌కు గానూ పెండింగ్ బిల్లులతో సహా రూ.34,110 చెల్లించారన్నారు. అసిస్టెంట్ లైన్‌మన్ రమేష్ ఉన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డి: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మున్సిపల్ ఆవరణలో పారిశుద్ధ్య సిబ్బందికి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ మేనేజర్ వాసంతి పర్యవేక్షించారు.

రికవరీ సెల్‌ఫోన్ అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన సీరడి లక్ష్మణ్‌కు మంగళవారం ఎస్సై సుధాకర్ సెల్ ఫోన్ అప్పగించారు. బాధితుడు తన సెల్‌ఫోన్ పోయినట్లు లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి అప్పగించారు.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపడం లేదని బీసీ సంఘం రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి పుట్ట భాస్కర్ విమర్శించారు. మంగళవారం ఆయన నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థి చనిపోతే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అది యాజమాన్యమే భరించాలని విద్యాహక్కు చట్టంలో పొందు పరచాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని పూజలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు మంత్రి పదవి రావాలని కోరుకుంటూ మహారాష్ట్రకు తరలివెళ్లి తుల్జాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, యూత్ అధ్యక్షుడు సుప్పాల సందీప్, రమేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

బాల మల్లేష్ మరణం పార్టీకి తీరని లోటు

బాన్సువాడ: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్ మరణం సీపీఐకి తీరని లోటని సీపీఐ నేత దుబాస్ రాములు అన్నారు. మంగళవారం బాన్సువాడ సీపీఐ కార్యాలయం వద్ద మల్లేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు లక్ష్మీనారాయణ, సుజాత ఉన్నారు.

పెండింగ్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో తమకు రావాల్సిన పెండింగ్ రెమ్యూనరేషన్ అందజేయాలని డిమాండ్ చేస్తూ మండల ఆశావర్కర్లు మంగళవారం మెమొరాండం అందజేశారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే నిర్వహించినందుకు తమకు చెల్లించాల్సిన రూ.2,800లను వెంటనే విడుదల చేయాలని సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రవణ్‌కు మెమొరాండం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాజంపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో నీటి సదుపాయం, విద్యుత్ సదుపాయాల గురించి సంబంధిత బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.